నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 22 సెప్టెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

ఆలేరులో నేతన్నలకు చేనేత త్రిఫ్ట్ చెక్కులను అందిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- చేనేత కార్మికులకు చెక్కుల పంపిణీ

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 21 : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం ఆలేరులోని లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో ఆయన వర్ధంతి నిర్వహించారు. ప్రభుత్వ విప్ హాజరై లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో నేతన్నకు చేయూత పథకం, త్రిఫ్ట్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం పరితపించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. పార్లమెంటులో ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన మొదటి వ్యక్తి గుర్తు చేశారు. ఆలేరు నియోజకవర్గంలోని 1862 మం చేనేత కార్మికులకు 34 నెలలకు గానూ రూ.18.60 కోట్ల నిధులు విడుదల అయినట్లు తెలిపారు. వాటితోపాటు కల్యాణలక్ష్మి చెక్కులను, గ్యాస్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ మహ్మద్ కామిల్, సీఈఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ చామలను కలిసిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల, ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ఆధ్వర్యంలో ఎంపీని కలిసిన ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు

చౌటుప్పల్, సెప్టెంబర్ 21 : ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని శనివారం చౌటుప్పల్‌కు చెందిన నిర్వాసిత రైతులు కలిసి వినతి పత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏండ్ల తరబడి వ్యవసాయం నమ్ముకొని జీవిస్తున్న తమ భూములు కోల్పోతే రోడ్డున పడుతామని బాధితులు తెలిపారు. అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేయాలని, లేకపోతే భూమికి బదులు భూమి లేదా ప్రస్తుత బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు. ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని బాధిత రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, రైతు సంఘాల నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, గోపగోని లక్ష్మణ్, దబ్బేటి రాములు గౌడ్, దుబ్బాక ఆకాశ్ రెడ్డి, గుండెబోయిన వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా స్వయం సహాయక సంఘ మహిళలతో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ అనిల్‌కుమార్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్

మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

- కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ టీకే అనిల్‌కుమార్

భూదాన్ పోచంపల్లి/చౌటుప్పల్‌రూరల్, సెప్టెంబర్ 21 : మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రెటరీ టీకే అనిల్‌కుమార్ అన్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మహిళా స్వయం సహాయక బృందాల సమావేశానికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక బృందాల పని తీరు, ఆర్థిక పురోగతి, బ్యాంకు లావాదేవీలు, సంఘం నిర్వహణపై వారితో చర్చించారు. జీవన అభివృద్ధి రుణా లు తీసుకున్న తర్వాత వచ్చిన మార్పుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ మహిళలు స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాలు తీసుకొని వాటిని వినియోగించుకుంటున్న తీరు తనను ఆశ్చర్య పరిచిందన్నారు. ఒక మహిళా సంఘం జమానత్ లేకుండా 50 లక్షల రుణం పొంది, తిరిగి క్రమం తప్పకుండా బ్యాంకు లో చెల్లించడం గొప్ప విషయమనారు. అనంతరం స్వామి రామానంద్ తీర్థ గ్రామీణ సంస్థను సందర్శించారు వివిధ ట్రేడ్‌ల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతు కే జెండగే, ఐఎఫ్ఎస్ అధికారి షరీఫ్ ఉల్లా, యాదాద్రి అడిషనల్ కలెక్టర్ గంగాధర్, జా యింట్ కమిషనర్ కే నరసింహులు, ఎస్ఎంబీ డైరెక్టర్ సురేష్‌బాబు, సాయి లక్ష్మి, జడ్పీ సీఈఓ శోభారాణి, తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్ పాల్గొనారు. అంతకుముందు చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ నాగారం గ్రామంలో ఉపాధి హామీ పనులను టీకే అనిల్‌కుమార్ పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హా మీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ గంగాధర్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శోభారాణి, డీఆర్డీఏ పీడీ నాగిరెడ్డి, అడిషనల్ పీడీసురేశ్, డివిజినల్ పంచాయతీ అధికారి ప్రతాప్‌నాయక్, ఎంపీడీఓ ప్రమోద్ కుమార్, ఎంపీఓ అంజిరెడ్డి ఉనారు.

బాబా సాహెబ్‌కు అవమానం

- భీమనపల్లిలో అంబేద్కర్ విగ్రహం చెయ్యి ధ్వంసం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబర్ 21 : మండలంలోని భీమనపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం చేతిని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. చెయ్యిని విరగ్గొట్టి పక్కనే చెట్లలో కింద పడేశారు. గణేశ్ నిమజ్జనం అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు చెయ్యిని ధ్వంసం చేశారని అనుమానిస్తున్నారు. విగ్రహం చేతిని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఘటన విషయమై స్థానిక ఎస్ఐ భాస్కర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు యాట కైలాసం, చిన్నలచ్చి లింగస్వామి, అంబేద్కర్ సంఘ నాయకులు మీసాల గణేశ్, కుక్క స్వామి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసమైన అంబేద్కర్ విగ్రహం

పట్టాదారు పాస్‌బుక్‌లు బంద్!

మూడు నెలలుగా నిలిచిపోయిన సరఫరా

- 10వేలకు పైగా పాస్ పుస్తకాలు పెండింగ్
- రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంతోనే జాప్యం
- ఆందోళనకు గురవుతున్న రైతులు
- తాసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- పంట రుణాలు, మార్టిగేజ్ లోన్లకు అవస్థలు
- ప్రైవేట్‌లో అధిక వడ్డీకి అప్పులు తెచ్చుకుంటున్న పరిస్థితి

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : పట్టాదారు పాస్ బుక్‌లు బంద్ అయ్యాయి. రైతులకు కొత్త పాస్ పుస్తకాలు సరఫరా కావడంలేదు. మూడు నెలలుగా నిలిచిపోయి.. వేలాది పుస్తకాలు పెండింగ్‌లోనే మూలుగుతున్నాయి. దాంతో పాస్ పుస్తకాలు రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పాస్ బుక్‌లు లేకపోవడంతో క్రాప్‌లోన్లు, మార్టిగేజ్ లోన్లు ఆగిపోతున్నాయి. రైతులు వివిధ సందర్భాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకుంటారు. భూముల క్రయ, విక్రయాలు జరిగిన సమయంలో భూమి కొనుగోలు చేసిన రైతులు వారి పేరు మీద పట్టాదారు పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకుంటారు. రిజిస్ట్రేషన్, డూప్లికేట్, ఇతర అవసరాలకు పాస్ బుక్ కోసం అప్లికేషన్ చేసుకుంటే కొత్తది అందివాల్సి ఉంటుంది. ఒక్కసారి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత పాస్ బుక్‌కు సంబంధించి తాసీల్దార్ కార్యాలయానికి సంబంధం ఉండదు. లాగిన్‌లో కూడా దాని స్టేటస్ చూపించదు. తర్వాత ప్రక్రియను హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ విభాగం ఫాలోఅప్ చేస్తుంది. అక్కడి నుంచే పాస్ పుస్తకాలను పోస్టల్ శాఖ ద్వారా సంబంధిత రైతు ఇంటికి నేరుగా పోస్ట్ ద్వారా పంపిస్తారు. అందుకోసం అధికారులు రిజిస్ట్రేషన్ చేసే సమయంలోనే అదనంగా 300 రూపాయలను కట్టించుకుంటారు.

మూడు నెలలుగా పెండింగ్..

సర్కారు నిబంధనల ప్రకారం పాస్ పుస్తకం నెల రోజుల్లోపే పోస్ట్ ద్వారా రైతులకు అందించాలి. కానీ జిల్లాలో మూడు నెలలుగా పాస్ బుక్‌ల సరఫరా ఆగిపోయింది. కొన్ని మండలాల్లో నాలుగైదు నెలలుగా పంపిణీ చేయడం లేదు. జిల్లాలోని 17 మండలాల్లో ఇదే పరిస్థితి ఉంది. సాధారణంగా ఒక్కో మండలంలో రోజుకు సగటున 7 నుంచి 10 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఈ లెక్కన నెలకు సుమారుగా 250 నుంచి 300 వరకు రిజిస్ట్రేషన్లు అవుతాయి. ఇలా మూడు నెలల్లో 10వేలకు పైగా పట్టాదారు పాస్ పుస్తకాలు పెండింగ్‌లో మూలుగుతున్నాయి. వారందరికీ ఎప్పటికప్పుడు పాస్ బుక్‌లను సరఫరా చేయాలి. పట్టాదారు పాస్ పుస్తకాలు రాకపోవడంతో రైతులు తాసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం సర్ది చెప్పి వెనక్కి పంపిస్తున్నారు.

సర్కారు నిర్వాకంతోనే ఆలస్యం..

పాస్ బుక్‌లు సరఫరా కాకపోవడానికి అధికారులు పలు కారణాలు చెబుతున్నారు. ప్రభుత్వం ధరణి స్థానంలో భూమాత తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నది. ఇప్పుడున్న ధరణి పుస్తకాల్లో పాత తెలంగాణ ముద్ర ఉంది. ఈ నేపథ్యంలోనే భూమాత వచ్చాక ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నదని కొందరు అధికారులు చెప్పుకొస్తున్నారు. అయితే భూమాత వచ్చాక కొత్త వారికి కొత్త బుక్‌లు ఇవ్వచ్చని, ఇప్పటి నుంచే ఎందుకు ఆపాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పోస్టల్ శాఖ వారికి సర్కారు బకాయిలు చెల్లించ లేదని, అందుకే వారి పంపిణీ నిలిపివేశారని మరికొందరు చెబుతున్నారు. పుస్తకాల పంపిణీ ఏజెన్సీని మార్చాలనే యోచనలో సర్కారు ఉందని, అందుకే ఆలస్యమవుతున్నదని కూడా తెలుస్తున్నది.

రుణాలకు ఇక్కట్లు..

ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ జరిగి మూడు నెలలు గడుస్తున్నా పాస్ పుస్తకాలు రాకపోవడంతో రైతులు అభద్రతా భావానికి గురవుతున్నారు. పాస్ బుక్ రాకపోవడంతో ఏమైనా తప్పులు, పొరపాట్లు జరిగాయా? ఎందుకు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పాస్ బుక్ ఉంటేనే బ్యాంకులు పంట రుణాలు, మార్ట్‌గేజ్ లోన్లు ఇస్తాయి. వ్యవసాయ పనుల సీజన్ కావడంతో అనేక మంది పంట రుణాలు తీసుకుంటారు. కానీ బుక్‌లు రాకపోవడంతో అవసరం ఉన్న రైతులు రుణాలు పొందలేని పరిస్థితి నెలకొంది. దాంతో ప్రైవేట్‌లో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే పాస్ బుక్‌లు సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పాస్‌బుక్ కోసం రెండు నెలల నుంచి చూస్తున్నా

జూలై 22న భూమి రిజిస్ట్రేషన్ చేయించాం. పోస్టల్ చార్జీ కూడా 300 రూపాయలు ముందే చెల్లించాం. రెండు నెలలు అవుతున్నా పాస్‌బుక్ రాలేదు. తాసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. వస్తదని అధికారులు చెబుతున్నారు. లోన్ కోసం పాస్ బుక్ తప్పకుండా కావాలని బ్యాంకు అధికారులు అడుగుతున్నారు. ప్రైవేట్‌లో వడ్డీకి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- రాయని బాలకృష్ణ, రైతు, వెల్మజాల

పాస్‌బుక్ రాక ఆందోళన చెందుతున్నాం

జూలై 16న మా భూమి రిజిస్ట్రేషన్ అయ్యింది. ఇప్పటివరకు పట్టాదారు పాస్ బుక్ రాలేదు. రిజిస్ట్రేషన్‌లో ఏదైనా సమస్య ఉందా అని ఆందోళన చెందుతున్నాం. అధికారులను అడిగితే త్వరలోనే వస్తుందంటున్నారు. ప్రభుత్వం వెంటనే పాస్ బుక్‌లను అందించాలి.

- మైస ఉమ, రైతు, గుండాల

దసరా తర్వాత ధాన్యం సేకరణ

- సూర్యాపేట జిల్లాలో 3.70 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం

- 206 కొనుగోలు కేంద్రాలకు కసరత్తు
- నాలుగు నెలల పాటు సాగనున్న సేకరణ
- కాంగ్రెస్ ఇచ్చిన హామీ రూ.500 బోనస్‌పై స్పష్టత కరువు

సూర్యాపేట, సెప్టెంబర్ 21 : వానకాలం రైతులు పండించిన వరి ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. సూర్యాపేట జిల్లాలో 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం పెట్టుకుంది. అందుకుగానూ 206 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రాథమిక నిర్ణయానికి వచ్చింది. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులతోపాటు ఇతర సామగ్రిని సమకుర్చుకుని అక్టోబర్ మూడో వారంలో దసరా తర్వాత కొనుగోళ్లు ప్రారంభించనున్నది. నాలుగు నెలల పాటు కొనుగోళ్లు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. మొత్తం 3.70 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యంలో దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకమే కొనుగోలు చేయనున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన సన్నధాన్యం కింటాకు రూ.500 బోనస్‌పై ఇపప్పటివరకూ ఎలాంటి స్పష్టత రాలేదు. తాజాగా బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ రాష్ట్ర స్థాయి అధికారులు ఈ విషయం ప్రస్తావించకపోవడం గమనార్హం.

2024-25 వానకాలం జిల్లావ్యాప్తంగా రైతులు నాలుగు లక్షల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. అందులో దాదాపు 10.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో దొడ్డు రకం దాన్యం 3.94 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుండగా, సన్నాలు 6.28 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేసి ధాన్యం కొనుగోలు ప్రణాళికలు సిద్ధం చేశారు. రైతుల అవసరాలకు, మిల్లుల సేకరణ, మార్కెట్ సేకరణ పోగా దాదాపు 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అక్టోబర్ నెలలో 74 వేల మెట్రిక్ టన్నులు, నవంబర్‌లో 1.11 లక్షల మెట్రిక్ టన్నులు, డిసెంబర్‌లో 1.29 లక్షల మెట్రిక్ టన్నులు, జనవరిలో 55 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 206 కొనుగోలు కేంద్రాల్లో ఐకేపీ 129, పీఏసీఎస్ 64, మెప్మా సెంటర్లు 13 ఉన్నాయి. ధాన్యం సేకరణకు 92.55 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా, జిల్లాలో 21.72 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. మరో 70.82 లక్షల బస్తాలు తెప్పించాల్సి ఉంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని 61 మిల్లులకు తరలించనున్నారు.

రూ. 500 బోనస్‌పై స్పష్టతేది?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులు పండించిన ధాన్యం కింటాకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ నిచ్చింది. ఎన్నికల తరువాత సన్న రకం ధాన్యానికే బోనస్ అంటూ మాట మార్చింది. ఇప్పుడు అదైనా ఇస్తారా, లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లోనూ ఈ అంశంపై చర్చ జరుగకపోవడం, జిల్లా అధికారులు సైతం దొడ్డు రకం సేకరణే ఎక్కువ లక్ష్యంగా పెట్టుకోవడంతో బోనస్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి.

బతికుండానే చంపేశారు..
పింఛన్ ఇప్పించండి సారూ..!

- బాధితుడు గఫూర్ ఆవేదన
- మఠంపల్లిలో అధికారుల నిర్లక్ష్యం

పింఛన్ బాధితుడు గఫూర్

మఠంపల్లి, సెప్టెంబర్ 21 : అధికారుల నిర్లక్ష్యం ఓ వ్యక్తిని బతికుండగానే చంపేసింది. ప్రాణంతో ఉన్న వ్యక్తి చనిపోయాడంటూ నిర్లక్ష్యంగా రికార్డులకు ఎక్కించడంతో వృద్ధాప్యంలో ఆయనకు పింఛన్ కూడా దక్కడం లేదు. నేను బతికే ఉన్నాను మహాప్రభో.. కణికరించి పింఛన్ ఇప్పించండి అని కనబడినా అధికారినల్లా వేడుకుంటున్నాడు షేక్ గఫూర్. బాధితుడి వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన షేక్ గఫూర్ వయస్సు 65 ఏండ్లు. వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. ఇప్పుడు వయస్సు మీద పడడంతో శక్తి చాలక ఇంటి వద్దే ఉంటున్నాడు. ఉపాధి మార్గం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గఫూర్ ప్రభుత్వం నుంచి పింఛన్ కూడా అందడం లేదు. అధికారుల నిర్లక్ష్యం ఆయన్ని పింఛన్‌కు దూరంగా చేసింది. పైగా బతికుండగానే చనిపోయినట్లు ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డుల్లోకి ఎక్కించడంతో గఫూర్ నేను బతికే ఉన్నాను అని చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో గఫూర్‌కు ఆసరా పింఛన్ వచ్చినప్పటికీ అధికారులు ఆయన చనిపోయినట్లు రికార్డుల్లో పేర్కొనడంతో మధ్యలో ఆగిపోయింది. దాంతో కొన్ని నెలల నుంచి ఎంపీడీఓ కార్యాలయం, జిల్లా అధికారుల చుట్టూ తిరిగినా సమస్యను పరిష్కరించడం లేదని, తనకు ఫించన్ తిరిగి మంజూరు చేయడం లేదని గఫూర్ వాపోతున్నాడు. ఈ విషయంపై ఎంపీడీఓ శ్రీనివాస్‌ను నమస్తే తెలంగాణ వివరణ కోరగా, షేక్ గఫూర్ అనే వ్యక్తి చనిపోయాడని చెప్పి పింఛన్ తొలగించిన విషయం తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని, విచారణ జరిపి రెండ్రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

సూర్యాపేట హనుమాన్‌నగర్‌లో ఇంటిపై పిడుగు పడడంతో దెబ్బతిన్న పిల్లర్

అంతటా వర్షం

మాల్‌లో పిడుగుపాటుతో రైతు మృతి

సూర్యాపేటలోనూ పిడుగుల బీభత్సం

నల్లగొండ/ మాల్/ బొడ్రాయిబజార్/ భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 21 : ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా రెండ్రోజుల నుంచి వర్షం కురుస్తున్నది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం రాత్రి వరకు దాదాపు అన్ని మండలాల్లోనూ వాన పడింది. శనివారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పిడుగులు భీభత్సం సృష్టించాయి. చింతపల్లి మండలంలోని విండజమూర్‌కు చెందిన రైతు యాచారపు జంగయ్య(45) సాయంత్రం తన పొలంలో పని చేస్తుండగా పిడుగు పడింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోనూ శనివారం మధ్యాహ్నం రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. వీధులన్నీ జలమయమయ్యాయి. హనుమాన్‌నగర్‌లో ఎస్‌కే మదార్ అనే వ్యక్తి ఇంటిపై పిడుగు పడడంతో ఆ ఇంటితో పాటు సమీప నివాసాల్లో టీవీలు, ఫ్యాన్‌లు, స్విచ్‌బోర్డులు కాలిపోయాయి. తాళ్లగడ్డలో లునావత్ విజయ్‌సింగ్ ఇంటిపై పిడుగు పడింది. జనావాసం మధ్య పిడుగు పడడంతో అంతా భయభ్రాంతులకు గురయ్యారు. నేరేడుచర్లలోనూ వర్షం దంచికొట్టింది. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా చందంపేట మండలంలో 87.8 మిలీమీటర్లు, తిప్పర్తిలో 74.5 మి.మీ వర్షపాతం నమోదైంది. గుర్రంపోడులో 54.5, గుండ్లపల్లి, నార్కట్‌పల్లిలో 54.0, మర్రిగూడలో 45.5, మునుగోడులో 45.3, నాంపల్లిలో 45.3, కేతేపల్లిలో 44.3, చిట్యాలలో 42.3, దేవరకొండలో 42.3, చింతపల్లిలో 42.0, మిర్యాలగూడలో 34.3, కట్టంగూర్‌లో 30.0, నకిరేకల్‌లో 29.8, త్రిపురారంలో 29.3, చందంపేటలో 27.5, అనుములలో 25.3, చండూర్‌లో 25.3, అడవిదేవులపల్లిలో 24.5, నేరేడుగొమ్ములో 24.3, పీఏపల్లిలో 24.0,కట్టంగూర్‌లో 23.8, నిడమనూరులో 19.5, తిరుమలగిరి(సాగర్)లో 18.5, వేములపల్లిలో 17.5, మాడ్గులపల్లిలో 16.8, నల్లగొండలో 16.0, కనగల్‌లో 14.3, శాలిగౌరారంలో 13.5, పెద్దవూరలో 8.0, దేవరకొండ, త్రిపురారంలో 6.8, దామరచర్ల మండలంలో 3.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. శాలిగౌరారం మండలంలో భారీ వర్షానికి వరి పైర్లు నేలవాలాయి.

శాలిగౌరారం శివారులో నేలకొరిగిన వరి పైరు

యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ మండలంలో అత్యధికంగా 65.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మోత్కూరులో 61.5, బొమ్మలరామారంలో 55.3, వలిగొండలో 50.5, రామన్నపేటలో 47.8, చౌటుప్పల్లో 41.5, అడ్డగూడూరులో 22.8, ఆత్మకూరు(ఎం)లో 20.8, భూదాన్‌పోచంపల్లిలో 18, ఆలేరులో 15.5, సంస్థాన్‌నారాయణపురంలో 13.8, భువనగిరిలో 11.5, తుర్కపల్లి మండలంలో 3.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA
• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• టెండర్ పిలుపు
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• పుష్పార్చన మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.
సెల్: 9182777625
నల్లగొండ : 9182 777 635
నకిరేకల్ : 9182 777 635
సూర్యాపేట : 9182 777 630
మిర్యాలగూడ : 9182 777 059
యాదాద్రి భువనగిరి : 9182 777 638
కోదాడ : 9182 777 630
హుజూర్‌నగర్ : 9182 777 059
హాలియా : 9182 777 059
దేవరకొండ : 9182 777 635
చౌటుప్పల్ : 9182 777 638